# ఐసీ ఫేస్ నైస్‌గా..

**ఎండల్లో ఎక్కువగా తిరిగితే.. చర్మం తేమను కోల్పోతుంది. ముఖమంతా వాడిపోయి.. అంద విహీనంగా మారుతుంది. మళ్లీ ముఖవర్చస్సును పెంచడంలో 'ఐస్ థెరపీ' సమర్థంగా పనిచేస్తుంది. రూపాయి ఖర్చులేకుండా ఇంట్లోని ఫ్రిజ్‌లో తయారయ్యే ఐస్ క్యూబ్.. మిమ్మల్ని నైస్‌గా మార్చేస్తుంది.**

**ఐస్** క్యూబ్‌ను మెత్తటి వస్త్రంలో చుట్టి, ముఖంపై సున్నితంగా మర్దనా చేసుకోవడమే.. ఐస్ థెరపీ. చర్మం రకాన్ని బట్టి రెండుమూడు నిమిషాలపాటు మర్దనా చేసుకోవాలి. ముఖ్యంగా, అందం కోసం టీ–జోన్ (నుదురు, ముక్కు, గడ్డం) ప్రాంతంలో సున్నితంగా మసాజ్ చేస్తే చాలు. ఈ చిన్న టెక్నిక్.. ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది.

**ఐస్ థెరపీ..** చర్మానికి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దాంతో చర్మం కాంతిమంతంగా, ఆరోగ్యంగా తయారవుతుంది.

**నిద్రలేమి,** ఎండలో తిరగడం వల్ల కళ్ల కింద వాపు కనిపిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో 5 నుంచి 10 నిమిషాల పాటు కళ్ల కింద సున్నితంగా ఐస్ థెరపీ చేయాలి. రక్త ప్రసరణ మెరుగుపడి.. కంటి కింద వాపు, నల్లటి వలయాలు తగ్గుతాయి. కళ్లు అందంగా కనిపిస్తాయి.

**ఐస్** థెరపీతో చర్మంలోని రక్తనాళాలు సంకోచించి.. చర్మం బిగుతుగా మారుతుంది. చర్మ రంధ్రాలు కూడా చిన్నగా కనిపిస్తాయి. దాంతో ముఖంలో కాంతి పెరుగుతుంది.

**చెమటతో** మొటిమలు వస్తాయి. ఇలాంటి సందర్భాల్లో మొటిమలపై 10 నుంచి 15 నిమిషాలు ఐస్ థెరపీ చేయాలి. దీనివల్ల రక్తనాళాలు సంకోచిస్తాయి. వాపు, ఎరుపును తగ్గిస్తాయి. మొటిమలు పూర్తిగా తొలగకపోయినా.. దాని పరిమాణం తగ్గిపోతుంది.

**ఐస్** థెరపీతో చర్మంలో కొలాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా చర్మం మరింత బిగుతుగా తయారై.. యవ్వనంగా కనిపిస్తారు.

**చర్మం** మరింత సున్నితంగా ఉంటే.. ఎండలకు ఎర్రగా కందిపోతుంది. కొందరిలో మంట కూడా కలిగిస్తుంది. ఐస్ థెరపీతో ఈ సమస్యకు ఇట్టే చెక్ పడుతుంది. కందిపోయి మంట కలిగించే చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది.



### జాగ్రత్తలు

అనేక ప్రయోజనాలు అందించే ఐస్ థెరపీని ఇంట్లోనే ఈజీగా చేసుకోవచ్చు. అయితే, సరైన జాగ్రత్తలు పాటించడం మాత్రం తప్పనిసరి. కొన్ని సందర్భాల్లో ఐస్ క్యూబ్స్ చర్మానికి హాని కలిగించవచ్చు. ముఖ్యంగా, కళ్ల కోసం ఉపయోగించే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

- ఐస్ క్యూబ్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ చర్మంపై నేరుగా వాడకూడదు. తప్పకుండా మెత్తని వస్త్రంలో ఉంచే.. మర్దనా చేయాలి.
- ముఖంపై మంచు ముక్కను 2 –3 నిమిషాల కంటే ఎక్కువసేపు ఉంచకూడదు.
- ఐస్ థెరపీ చేసుకునే ముందు.. మీ చర్మ లక్షణాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఏవైనా స్కిన్ అలర్జీలు, ఇరిటేషన్స్ ఉంటే.. చర్మ నిపుణులను సంప్రదించడం మంచిది.
- చర్మం నల్లబడ్డా, ఎర్రబడ్డా.. ఈ థెరపీని వెంటనే ఆపేయాలి. దీర్ఘకాలిక చర్మ సమస్యలు ఉన్నవారు దీనికి దూరంగా ఉండాలి.







# మన మామిడిపల్లి మీసం మెలేసింది!



**సరిహద్దుల్లో కలకలం.. ఆ పల్లెలో కదనోత్సాహం. అలాగని ఆ గ్రామం ఎల్ వోసీ సమీపంలో ఉందనుకుంటే పొరపాటు. మన తెలంగాణలో.. పచ్చటి పొలాల మధ్య.. నిశ్చింతగా ఉన్న గ్రామం అది. కానీ, ఈ గడ్డన పుట్టిన యోధులు రక్షణ రేఖ వెంబడి లక్ష్మణ రేఖగా నిలబడ్డారు మరి! ఒకరు కాదు ఇద్దరు కాదు.. పద్నాలుగు మంది జవాన్లకు జన్మనిచ్చిన గ్రామం మామిడిపల్లి. 'జై జవాన్.. జై కిసాన్..' ఇదే ఆ పల్లె నినాదం. పల్లె పొలిమేరలో వ్యవసాయం చేస్తూ కనిపిస్తారు పెద్దలు. యువకులేమో దేశ సరిహద్దులో.. రాకెట్ లాంచర్లు భుజాన ధరించి గస్తీ కాస్తుంటారు. పొలిమేరలో మీసం మెలేస్తున్న మామిడిపల్లి కథ ఇది..**

**దేశ** రక్షణకు అందరూ ముందుకు రావాలని చాలామంది పిలుపునిస్తారు. కానీ, ఆ రక్షకుడు తమ ఇంట్లో పుట్టకుంటే బాగుంటుందని భావిస్తారు. ఆయుష్షు గీత ఎంత బలంగా ఉన్నా.. యుద్ధంలో ఏ ప్రమాదం ఎట్నుంచి ముంచుకొస్తుందో తెలియదు. అందుకే, నరనరాల్లో దేశభక్తి ఉన్నా.. జవాన్ జాబ్ అంటే నూటికో కోటికో ఒకరు మాత్రమే ధైర్యం చేస్తారు. నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం మామిడిపల్లి గ్రామం పద్నాలుగు మంది సైనికులకు అడ్డా! ఊరు విడిచి దేశసేవకు అంకితం కావాలన్న ఆశయం 2001లో ఈ పల్లెలో పురుడు పోసుకుంది. అప్పట్నుంచి 14 మంది యువకులు ఆర్మీ, ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్ (ఐటీబీపీ) దళాల్లోకి వెళ్లారు. దేశ సేవలో తరిస్తున్నారు. అందుకే అడవి మామిడిపల్లి గ్రామాన్ని జైహింద్ మామిడిపల్లి, ఆర్మీ మామిడిపల్లి అని పిలుస్తుంటారు.

### అడుగడుగునా ఆదర్శం..

ఆర్మీ మామిడిపల్లి ఊళ్లో అడుగుపెట్టగానే స్వామి వివేకానంద విగ్రహం కనిపిస్తుంది. 'ఉక్కు నరాలు.. ఇనుప కండరాలు ఉన్న యువకులు భారతదేశానికి కావాలి' అన్న వివేకానందుడి మాటలు ఈ గ్రామ యువతకు అచ్చంగా సరిపోతాయి. ఆ మాటలే స్ఫూర్తిగా నూనూగు మీసాలు రాగానే.. ఆర్మీలో చేరడమే తొలి ప్రాధాన్యంగా పెట్టుకుంటారు ఇక్కడి పిల్లలు. అందుకోసం కఠోర సాధనలు చేస్తారు. కండలు పెంచి యోధుల్లా తయారవుతారు. గ్రామం నడిబొడ్డున ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం... అనుక్షణం తమలో దేశభక్తిని నూరిపోస్తూ ఉంటుందని చెబుతారు మామిడిపల్లి యువకులు. మన్యం వీరుడు అల్లూరి విగ్రహం పోరాట స్ఫూర్తిని ఇస్తుందంటారు. ఇలా దేశభక్తికి ఆనవాలుగా నిలవడమే కాదు.. వీరత్వానికి చేవ్రాలుగా కీర్తి గడించింది ఆర్మీ మామిడిపల్లి.

### ఇది మా మాట..

ఇప్పటికే ఆర్మీలో పదిహేనేండ్ల పాటు సేవలు అందించి రిటైర్ అయిన జవాన్లు ఐదారుగురు మామిడిపల్లిలో కనిపిస్తారు. సరిహద్దు పరిస్థితులను గ్రామస్తులతో పంచుకుంటూ ఉంటారు. తాము ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితులను యువతకు వివరిస్తుంటారు. సైనికుల తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు భరోసా ఇస్తుంటారు. యుద్ధంలో మనదే పైచేయి అవుతుందనీ, పాకిస్థాన్‌కు అంత సీన్ లేదని చెబుతారు హవల్దార్‌గా పనిచేసిన వంజరి రవీందర్. 'పాకిస్థాన్‌ది అంతా మేకపోతు గాంభీర్యమే. మనదేశాన్ని ఎదుర్కొనే సత్తా పాక్‌కు లేదు. అయితే, సరిహద్దుల్లో.. మనం టీవీలో చూస్తున్న దానికి, పేపర్‌లో చదువుతున్న దానికి చాలారెట్లు భీకర వాతావరణం ఉంటుంది. పరిస్థితులు అంచనాలకు అందకుండా మారిపోతుంటాయి. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. నేను జవాన్ నుంచి హవల్దార్ దాకా పనిచేశాను. నేను విధుల్లో ఉన్నరోజుల్లో నిత్యం ఘర్షణ పూరిత వాతావరణం ఉండేది. దేశం కోసం సదా సిద్ధంగా ఉండేవాళ్లం' అని గుర్తు చేసుకున్నారు మాజీ జవాన్ వంజరి రవీందర్. 'ఆర్మీ ఆపరేషన్స్‌లో పాల్గొన్న సైనికులకు ఆందోళన ఉండదు. దేశం కోసం పోరాడుతున్నామని గర్వంగా ఉంటారు. అలాంటి అవకాశం రావడాన్ని గొప్పగా భావిస్తారు. మా మామిడిపల్లి బిడ్డలు వెన్ను చూపకుండా పోరాడతారు. ఇండియన్ ఆర్మీ దెబ్బకు పాక్ కథ వారంలో ముగుస్తుంది అనడంలో సందేహం లేదు' అంటారాయన. 'భారత్ వైపు చూడాలంటేనే వణికిపోయేలా పాక్‌కు బుద్ధి చెప్పే సత్తా మన సైనికులకు ఉంది' అన్నారు మాజీ ఆర్మీ జవాన్ కేతావత్ రవీందర్. మొత్తంగా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. మామిడిపల్లి మళ్లీ మీసం మెలేస్తున్నది. సరిహద్దులో ఉన్న తమ బిడ్డలు.. క్షేమంగా ఉంటారనీ, దేశానికి విజయం చేకూరుస్తారని బలంగా చెబుతున్నారు.

> **స్ఫూర్తి కేంద్రం..**
>
> **సాధారణంగా** ఇంటర్, డిగ్రీ చదివే సమయంలో సినిమాలు, షికార్లు అంటూ టైం పాస్ చేయడం చూస్తుంటాం. ఈ గ్రామ యువకులు మాత్రం అర్హత రాగానే.. ఆర్మీ ఉద్యోగానికి దరఖాస్తు చేసి పరీక్షలకు సన్నద్ధం అవుతుంటారు. ఆర్మీ జాబ్ కొట్టలేకపోతే పోలీసు ఉద్యోగంపై గురిపెడతారు. పోలీసు శాఖలో పదుల సంఖ్యలో ఉన్నారు ఇక్కడివాళ్లు. ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ సత్తా చాటుతున్నారు. అలా దేశసేవలో, సమాజ అభ్యున్నతిలో ముందున్న మామిడిపల్లి స్ఫూర్తి కేంద్రం అనడంలో సందేహం లేదు.


... జూపల్లి రమేష్, పోతన్న
నీరడి శ్రీనివాస్


# విశ్వాసంతో బరిలోకి

**ప్రాణాలకు తెగించిన సైనికుడికి విశ్వాసానికి మారుపేరైన శునకం తోడైతే.. శత్రువుల జాడ కనిపెట్టడం, వారిని మట్టుపెట్టడం చాలా తేలిక. అందుకే సాయుధ బలగాలు సంక్లిష్టమైన సందర్భాల్లో జాగిలాలను ఆయుధంగా ఎంచుకుంటాయి. అయితే ఈ జాగిలాలతో సమరానికి వెళ్లడం ఆయుధం ప్రయోగించడం కన్నా కష్టం. నేర్పుతోపాటు ఓర్పు కూడా చాలా అవసరం. సాహసం, సహనం ఉన్నవారికే డాగ్ హ్యాండ్లర్ బాధ్యతలు అప్పగిస్తుంది సైన్యం. అలాంటి సాయుధ చర్యల్లో భారత్ తరపున సత్తా చాటుతున్నది డాగ్ హ్యాండ్లర్ పీవీ శ్రీలక్ష్మి. కంటిచూపుతో జాగిలాన్ని నియంత్రిస్తూ, ఒంటిచేతితో శత్రువులను మట్టుబెడుతున్నది.**



**స**రిహద్దులో గస్తీ సరిగ్గా లేకపోతే దేశం ఆగమైతుంది. బోర్డర్‌లో భద్రతతోపాటు చొరబాట్లను అడ్డుకోవడంలో కీలకపాత్ర పోషించే సాయుధ బలగం అసోం రైఫిల్స్. సుదీర్ఘమైన సాయుధ దళాల చరిత్రలో ఎన్నో సాహసాలు చేసిన అసోం రైఫిల్స్‌లో సాహసనారి శ్రీలక్ష్మి ప్రత్యేకం. అప్రమత్తత, తెగువ, శత్రువు పన్నిన కుట్రను చాకచక్యంగా భగ్నం చేసే నేర్పరిగా ఆమెకు మంచి పేరుంది. ఆ నైపుణ్యాలే అసోం రైఫిల్స్‌లో మొట్టమొదటి మహిళా డాగ్ హ్యాండ్లర్‌గా ఆమెను చరిత్రలో నిలిచిపోయేలా చేశాయి.

**శత్రువుకు** చిక్కకుండా సాయుధ చర్యలో పాల్గొనడం సైనికుల సాధారణ విధి. కానీ, కొన్ని ప్రత్యేకమైన లక్ష్యాలు ఛేదించడం కోసం అదనపు నైపుణ్యాలు ఉండాలి. జాగిలాలతో కలిసి శత్రువుపై దాడి చేయడం కూడా అలాంటిదే. డాగ్ హ్యాండ్లర్ విధి మాటువేసి శత్రువును మట్టుబెట్టడమే కాదు... అంతకుమించిన సాహసం చేయాలి. ఒక చేత్తో ఆయుధం, మరో చేత్తో జాగిలాన్ని వెంటబెట్టుకుని సమరంలోకి దూకాలి. శత్రువు జాడ కనుక్కునే క్రమంలో ఏ మాత్రం అలికిడి అయినా ప్రాణాలకే ప్రమాదం. అందుకే ఎంతో అప్రమత్తత, సహనంతోపాటు మరెన్నో అదనపు మెలకువలు ఉండే వారికే ఈ డాగ్ హ్యాండ్లర్ బాధ్యతలు అప్పగిస్తారు.



**సైనికులను** హతమార్చేందుకు ఏర్పాటుచేసిన బాంబులను గుర్తించడం, వాటిని నిర్వీర్యం చేయడం ఇవన్నీ డాగ్ హ్యాండ్లర్స్ చాకచక్యంగా చేయాలి. సైనిక జాగిలాలకు ఎంతటి శిక్షణ ఉంటుందో, వాటిని ఉపయోగించే (డాగ్ హ్యాండ్లర్స్) వారు కూడా అంతే సాధన చేయాల్సి ఉంటుంది. ఆత్మరక్షణతోపాటు జాగిలాన్ని కాపాడుకోవడం, దాన్ని దాడిలో ఉపయోగించడం కీలకం. ఇన్నిట్లో ప్రతిభ కలిగిన శ్రీలక్ష్మి డాగ్ హ్యాండ్లర్‌గా ఎంపికై మహిళలందరూ గర్వపడే విజయం సాధించింది. సైనిక చర్యల్లో అత్యంత సమర్థంగా పనిచేసే శునక జాతిగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బెల్జియన్ మాలినోయిస్ జాతి జాగిలాలతో కలిసి ఆమె పనిచేస్తున్నది. పురుషాధిక్యత ఉన్న సైన్యంలో లింగ సమానత్వానికి ఒక బాట వేసింది. శ్రీలక్ష్మి విజయాల స్ఫూర్తితోనే అసోం రైఫిల్స్‌లో 4 శాతంగా ఉన్న మహిళా సైనికులను ఆరేండ్లలో పది శాతానికి పెంచాలని సైన్యం భావిస్తున్నది. స్త్రీ శక్తితో మరెన్నో విజయాలు సాధించాలనే లక్ష్యంతో..!

# కాస్మొటిక్స్‌తో క్యాన్సర్!

**ప్రపంచవ్యాప్తంగా** క్యాన్సర్ కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. ఏటా 20 లక్షలకుపైగా కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఆరు లక్షలకుపైగా క్యాన్సర్ మరణాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా.. మహిళల్లో రొమ్ము, గర్భాశయ, అండాశయ క్యాన్సర్లు అత్యంత ప్రబలంగా కనిపిస్తున్నాయి. చర్మ క్యాన్సర్లు కూడా ఆడవాళ్లను పట్టిపీడిస్తున్నాయి. అయితే, మహిళలు ఉపయోగించే అనేక సౌందర్య ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకాలు ఉన్నాయని తాజా అధ్యయనం ఒకటి కనుగొన్నది. అమెరికా లాస్ ఏంజెల్స్‌లో నిర్వహించిన ఈ సర్వే వివరాలు ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెటర్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సర్వేలో భాగంగా అమెరికాకు చెందిన 64 మంది మహిళలను ఎంచుకున్నారు. వారు నిత్యం ఉపయోగించే సబ్బులు, లోషన్‌లు, షాంపూ, కండిషనర్, స్కిన్ లైటనర్, ఐలైనర్, ఐలాష్ గ్లూ లాంటి దాదాపు 1,143 ఉత్పత్తులను పరిశీలించారు. అందులో 53 శాతం మంది ఫార్మాల్డిహైడ్ లాంటి క్యాన్సర్ కారకాలను విడుదల చేసే సౌందర్య ఉత్పత్తులను ఉపయోగించినట్టు కనుగొన్నారు. అనేక ఉత్పత్తుల్లో 'ఫార్మాల్డిహైడ్'ను విరివిగా వాడుతున్నారనీ, ఇది క్యాన్సర్ కారకమని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దీన్నుంచి విడుదలయ్యే వాయువులు క్యాన్సర్‌ను కలగజేయడమే కాకుండా.. శరీరంపై దద్దుర్లు, జుట్టు, గోళ్లపైనా ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. వీటిని అలాగే వాడితే దీర్ఘకాలంలో రొమ్ము క్యాన్సర్‌తోపాటు గర్భాశయం, అండాశయ క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. యూరోపియన్ యూనియన్ 2009లోనే ఫార్మాల్డిహైడ్‌ను కాస్మెటిక్ పదార్థంగా నిషేధించిందని పలువురు పరిశోధకులు గుర్తుచేశారు. అయినా అనేక సౌందర్య ఉత్పత్తుల సంస్థలు ఇష్టారాజ్యంగా వీటిని వాడుతున్నాయని చెబుతున్నారు. అయితే ఆయా ఉత్పత్తుల లేబుల్స్‌పై 'ఫార్మాల్డిహైడ్' గురించిన వివరాలు ప్రత్యక్షంగా ఇవ్వడం లేదనీ, చాలావరకు దాని రసాయనిక పేర్లనే వాడుతున్నారని తెలిపారు. కాబట్టి, వినియోగదారులు సౌందర్య ఉత్పత్తులను కొనుగోలు చేసే సమయంలో లేబుల్స్‌ను క్షుణ్నంగా చదవాలని సూచిస్తున్నారు. ఏ రకమైన ఉత్పత్తులు అనారోగ్యానికి గురిచేస్తాయో తెలుసుకోవడానికి రసాయన శాస్త్రవేత్తలే కావాల్సిన అవసరం లేదని, కాస్త అవగాహన ఉంటే చాలని అంటున్నారు. అందంగా ఉండాలని ఆరాటపడుతూ.. లేనిపోని రోగాలు కొని తెచ్చుకోవద్దని సలహా ఇస్తున్నారు.



# మసాలా పనీర్ ఫ్రై

### కావలసిన పదార్థాలు

**పనీర్ ముక్కలు:** ఒక కప్పు, **చిక్కటి పెరుగు:** అర కప్పు, **కారం:** ఒక టీస్పూన్, **పసుపు:** పావు టీస్పూన్, **గరం మసాలా:** అర టీస్పూన్, **జీలకర్ర పొడి, ధనియాల పొడి:** అర టీస్పూన్ చొప్పున, **ఉప్పు:** తగినంత, **అల్లం వెల్లుల్లి పేస్ట్:** అర టీస్పూన్, **నూనె:** అర కప్పు.

### తయారీ విధానం

ఒక గిన్నెలో పెరుగు, కారం, గరం మసాలా, జీలకర్ర పొడి, ధనియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, పసుపు వేసి బాగా కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఇప్పుడు పనీర్ ముక్కలకు ఈ పేస్ట్ పట్టించి పది నిమిషాల పాటు పక్కన పెట్టుకోవాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి నూనె వేడయ్యాక పనీర్ ముక్కలను విడివిడిగా వేసి, రెండువైపులా ఓమోస్తరుగా ఫ్రై చేస్తే పనీర్ మసాలా ఫ్రై సిద్ధం.





# కృత్రిమ మెరుపులు

**అతివల అలంకరణలో ఆభరణాలు ఎంత ముఖ్యమో, వాటి తయారీలో వజ్రాలదీ అంతే కీలకమైన పాత్ర. పసిడి వన్నెలకు వజ్రపు మెరుపులు తోడైతే ఇక చెప్పేదేం ఉంటుంది. అందుకేనేమో, ఎన్ని నగలు ఉన్నా.. ఒక్కటైనా వజ్రాభరణం లేకపోతే మగువ మనసు చిన్నబోతుంది. ముక్కెర నుంచి పట్టీల వరకు ఏదో ఒక నగలో డైమండ్ రాజ్యమేలితేనే ఆమెకు సంతృప్తి. కానీ, ఖరీదైన వజ్రాలు ఎంతమంది కొనగలరు. అలాగని ఇమిటేషన్‌లో లభించేవి సిసలైన డైమండ్ల మెరుపుతో సరితూగవు. ఈ సమస్యలకు చెక్ పెడుతూ రూపొందినవే కృత్రిమ వజ్రాలు. ప్రయోగశాలల్లో పురుడు పోసుకుంటున్న కృత్రిమ వజ్రాలు ఇప్పుడు సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చేశాయి. ఇంకేముంది అతివలకు వజ్రోత్సవమే కదా!**

**కృత్రిమ** వజ్రాలు సహజంగా దొరికే వాటికన్నా 30–50% తక్కువ ధరలో లభిస్తాయి. వీటిలోనూ రంగు, ఆకారం, పరిమాణాన్ని బట్టి ధరలు ఉంటాయి. నాణ్యతకు అనుగుణంగా సర్టిఫికెట్స్ కూడా ఇస్తారు. వీటి మెరుపు, కట్, క్యారెట్, కలర్ ఆధారంగా భిన్నమైన ధరల్లో లభిస్తున్నాయి. అభిరుచికి తగినట్లు నచ్చిన విధంగా ఈ వజ్రాలతో కస్టమైజ్డ్ ఆభరణాలను చేయించుకునే వీలుంది. ఆధునిక ట్రెండ్స్‌కి తగినట్టు మినిమలిస్ట్ డిజైన్స్‌తో సింగిల్ స్టోన్ డైమండ్ రింగ్స్, డెలికేట్ పెండెంట్స్, స్టడ్ ఇయర్ రింగ్స్ వెస్ట్రన్‌వేర్‌పై చక్కగా నప్పుతాయి. పెద్దపెద్ద రంగురంగుల వజ్రాలు పొదిగిన చోకర్లు, హారాలు, గాజులు, వడ్డాణాలు సంప్రదాయ దుస్తులకు మరింత అందాన్ని జోడిస్తాయి. ఇంకెందుకు ఆలస్యం మీరూ ఓసారి ఈ కృత్రిమ వజ్రాలను ధరించి అందంగా మెరిసిపోండి!







నగ ధగలు